దుర్భర జీవనంలో ఏజెన్సీ గీత కార్మికులు

- 70 ఏళ్ల వయస్సులో తాళ్లు ఎక్కుతున్న గౌడన్నలు
- వ్యాధుల బారిన పడుతున్న కార్మికులు
- ఏజెన్సీ గ్రామాల్లో వారికి నో పెన్షన్

గోవిందరావుపేట : మండలంలో కొందరి గీత కార్మికుల పరిస్థితి దారుణంగా ఉంది. కొద్దికాలం నుంచి గీత కార్మికులకు నరాలు చచ్చుపడడం, పక్ష వాతం బారిన పడడం, నరాలలోని రక్తంలో చీము వచ్చి గడ్డ కట్టి నడవరాక మంచంలో పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏటా సగటున 550 మంది కార్మికులు చెట్టుపై నుంచి జారి పడుతున్నారు. వారిలో 180 మంది చనిపోతున్నారు. 40 ఏళ్ల వయస్సులోనే పక్షవాతం బారిన పడుతున్నారు. ప్రపంచం అత్యాధునిక టెక్నాలజీతో చంద్రయాన్ లాంటి విజయవంతమైన ప్రయోగాలు చేస్తున్న ఈ తరుణంలో సంప్రదాయ పద్ధతిలో సాగుతున్న గీత వృత్తిలో సాంకేతిక పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కార్మికులకు ప్రత్యక్షంగా ఉపయోగపడే ఏ పథకం ఇప్పటి వరకు అమలుకాలేదు.

ఏజెన్సీలోనే తాటిచెట్లు

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో తాటిచెట్లు ఎక్కువగా ఉన్నాయి. ములుగు జిల్లా ఏజెన్సీ కావడంతో గీత కార్మికులకు ఐడీ కార్డులు ఇవ్వడానికి ఎక్సైజ్ శాఖ నిరాకరిస్తుంది. దీంతో ప్రభుత్వ పథకాలకు ఏజెన్సీ కార్మికులు ఆమడదూరంలో ఉంటున్నారు. అంతే కాకుండా కాటమయ్య కిట్లు పొందేందుకు వీలులేకుండా పోయింది. ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు రక్షణ కిట్లు అందించాలని కోరుతున్నారు.



తాటిచెట్టు ఎక్కుతున్న గౌడన్న



కాళ్లలో చీము చేరడంతో స్టాండ్ సపోర్ట్‌తో నడుస్తున్న ఐలయ్య

ప్రభుత్వం ఐడీ కార్డులు ఇవ్వాలి



జిల్లాలోని గౌడ కులస్తులు కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నందున సొసైటీలను పునరుద్ధరించి అందరికీ ఐడీ కార్డులు ఇవ్వాలి. తాటిచెట్లు ఎక్కి పక్షవాతం, ఇతర వ్యాధుల బారిన పడిన ప్రతి గౌడన్నను ప్రభుత్వం ఆదుకోవాలి. వేరే కులానికి అడ్డు రాని వన్ ఆఫ్ సెవంటీ యాక్ట్ ఒక్క గౌడ కులానికి రావడం శోచనీయం.

– మేకపోతుల వెంకటరమణ గౌడ్, గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సొసైటీ చేసుకునే హక్కు లేదు



కొన్ని మండలాల్లో వన్ ఆఫ్ సెవంటీ యాక్ట్ అమలులో ఉంది. దీంతో కార్మికులకు ప్రభుత్వం తరఫున ఐడీ కార్డులు ఇవ్వడం కుదరదు. గిరిజనేతరుల్లో గౌడ కులస్తులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిందే. అధికారికంగా ఏజెన్సీ గ్రామాల్లో గౌడ కులస్తులకు సొసైటీ చేసుకునే హక్కు లేదు. ప్రభుత్వ నిర్ణయం మేరకు మేము నడుచుకుంటాం.

– ఎం.సుధీర్ కుమార్, సీఐ, ఎక్సైజ్ శాఖ, ములుగు

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన మంత్రులు

గోవిందరావుపేట : స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర పంచాయితీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి పరిశీలించారు. మంత్రుల వెంట మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకట్రావ్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఆర్డీఓ వెంకటేష్, అధికారులు ఉన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క

జిల్లా అభివృద్ధిలో జగదీశ్ పాత్ర మరువలేనిది



ములుగు రూరల్ : జగదీశ్ సమాధికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



మంగపేట : జగదీశ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఏటూరునాగారం: జగదీష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు

మంగపేట: జిల్లా అభివృద్ధిలో దివంగత జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుసుమ జగదీశ్ పాత్ర మరువలేనిదని బీఆర్ఎస్ జిల్లా నాయకులు రాజమళ్ల సుకుమార్ అన్నారు. మండలంలోని అకినేపల్లి మల్లారంలో జగదీశ్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సుకుమార్ మాట్లాడుతూ జిల్లా ఏర్పాటైన తర్వాత తొలి జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి జిల్లా అభివృద్ధిలో ప్రత్యేక ముద్రగా నిలిచిన ఆయన భౌతికంగా దూరం అయినప్పటికి ప్రజల గుండెల్లో చిరకాలం సజీవంగా ఉంటారని కొనియాడారు. బీఆర్ఎస్ నాయకులు భద్రయ్య, సాంబశివరావు,రామకృష్ణ, రాజేంద్రన్, రాంబాబు, రాము, నాగేశ్వర్‌రావు, బాబూరావు, రామారావు, పాల్గొన్నారు.

ములుగు రూరల్: జనం మరువ లేని నేత మాజీ మాజీ జెడ్పీ చైర్మన్ జగదీశ్ అని మల్లంపల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద పార్టీ శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, యూత్ ప్రెసిడెంట్ మొర్రి రాజు, టౌన్ అధ్యక్షులు చీదర సంతోష్, జిల్లా యూత్ నాయకులు చోటు మహమ్మద్ ఉన్నారు.

ఏటూరునాగారం : తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట ఆయన చిత్రపటానికి సునీల్‌కుమార్ పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, మల్లారెడ్డి, కూనూరు అశోక్, ఖాజాపాషా, కిరణ్, రాజేష్, చిన్నికృష్ణ, నర్సయ్య, రవితేజ, రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

ఎస్ఎస్‌తాడ్వాయి : మండల కేంద్రంలో నేడు (గురువారం) డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు బండారి చంద్రయ్య తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క , దళిత సంఘాల నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆదివాసీలు, దళిత సంఘాల నాయకులు, ఉద్యోగులు, యువజన, వివిధ కుల సంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన పాపారావు

ఏటూరునాగారం : మండలంలోని రామన్నగూడెం గ్రామంలో తెల్లవారు జామున పాడిగేదెను ఢీకొని ఒకరు గాయపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మంగపేట మండలం గంపోనిగూడెం గ్రామానికి చెందిన బద్ది పాపారావు ఏటూరునాగారం వచ్చి స్వగ్రామానికి వెళ్తుండగా గేదెను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అనంతరం వరంగల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని స్థానిక వైద్యులు తెలిపారు.

నేడు తెరుచుకోనున్న పాఠశాలలు



బుట్టాయిగూడెం ఎంపీపీఎస్‌ను శుభ్రం చేసిన సిబ్బంది

కన్నాయిగూడెం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు నేడు (గురువారం) తెరచుకోనున్నాయి. వేసవి సెలవులను పూర్తి చేసుకొని జూన్ 12న పునఃప్రారంభం కానున్నాయి. కొన్ని రోజుల నుంచి మూతపబడిన పాఠశాలలు నేటి నుంచి బడి పిల్లలతో కళకళలాడనున్నాయి. వాటికోసం అధికారులు పాఠశాలలను సిద్ధం చేశారు. పాఠశాలల్లో చెత్తాచెదారం ఉండడంతో వాటి శుభ్రం చేశారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ములుగు రూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్ అన్నారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్ట్‌లను అమ్ముతూ నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దిలీప్, రాజ్‌కుమార్, వేణు, నవీన్, రమేష్, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టీవీ దగ్ధం

వాజేడు : మండలంలోని చీకుపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో టీవీ దగ్ధమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. చీకుపల్లికి చెందిన గొంది సంజీవరావు ఇంట్లో టీవీ ఆన్‌చేసి ఉంచారు. గ్రామంలో రెవెన్యూ సదస్సు జరుగుతుండటంతో కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. ఆన్‌లో ఉన్న టీవీ ఒక్కసారిగా పేలిన శబ్దం వచ్చి దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్ అక్కడికి వెళ్లి పరిశీలించారు.

ఇసుక లారీ ఢీకొని ఆరు గేదెలు మృతి

ఏటూరునాగారం : మండలంలోని చిన్నబోయినపల్లి ప్రధాన రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని ఇసుకలారీ ఢీకొట్టడంతో ఆరు పాడిగేదెలు మృతి చెందాయి. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన కాశీం అనే రైతుకు చెందిన 4 పాడిగేదెలు, ఆరవపల్లి రైతుకు చెందిన 2 పాడిగేదెలు మృతి చెందాయన్నారు. సుమారు రూ.3లక్షలు వరకు నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- మండల వ్యవసాయ అధికారి మహేష్

కన్నాయిగూడెం: మండలంలోని విత్తన షాపుల్లో నాణ్యమైన విత్తనాల విక్రయించాలని, నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని ముప్పనపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లోని ఫర్టిలైజర్స్, సీడ్, ఫెస్టిసైడ్స్ షాపుల్లో ఆయన అకస్మిక తనిఖీ చేశారు. షాపుల్లో ఉన్న వరి, మిర్చి విత్తనాల నాణ్యతను పరిశీలించారు. వాటికి సంబంధించిన పత్రాలు, షాపుల లైసెన్స్ పత్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టాక్‌కు సంబంధించిన రికార్డులు, క్రయవిక్రయాల రిజిస్టర్లను తప్పకుండా మెయింటనెన్స్ చేయాలన్నారు. షాపులకు సంబంధించిన లైసెన్స్ రెన్యూవల్ ఉండాలన్నారు. ధరల పట్టికను షాపు ఎదుట ఉంచాలని షాపు యజమానులకు సూచించారు. అనంతరం రైతువేదికలో రైతులకు ఏర్పాటు చేసిన విత్తనాల కొనుగోలుపై అవగాహన సదస్సులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు కొన్న విత్తనాలకు బిల్లు తప్పనిసరిగా పొందాలన్నారు. బిల్లుతో పాటు విత్తనాలకు వచ్చినపై కవర్‌ను పంట సీజన్ అయ్యేంత వరకు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ కళ్యాణి పాల్గొన్నారు.



ముప్పనపల్లిలోని ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఏఓ మహేష్

నేడు మండలంలో మంత్రి సీతక్క పర్యటన

ఏటూరునాగారం: మండలంలో నేడు పంచాయతీరాజ్, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క పర్యటించనున్నారు. గురువారం ఉదయం శ్రీనివాస కల్యాణ మండపంలో నాలుగు మండలాల్లోని నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బస్‌డిపోకు శంకుస్థాపన, గిరిజన భవన్‌లో ఇందిరమ్మ లబ్ధిదారులకు పత్రాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని వారు పేర్కొన్నారు.

చిన్నారుల సమగ్రాభివృద్ధి అంగన్‌వాడీల్లోనే సాధ్యం



బడిబాట కార్యక్రమంలో పిల్లలతో అంగన్‌వాడీ టీచర్లు

గోవిందరావుపేట : చిన్నారుల సమగ్ర అభివృద్ధి అంగన్‌వాడీ కేంద్రాల్లోనే సాధ్యమవుతుందని అంగన్‌వాడీ టీచర్ అరుంధతి అన్నారు. మండలంలోని చల్వాయిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన రహదారుల గుండా ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్ల లోపు వయస్సు గల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని, సెంటర్లకు అందుతున్న సేవలపై తల్లులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అలివేలు, మోక్షరాణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ నాయకుడు చాతాళ్ల రమేష్

మంగపేట: జూలై 07న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని అన్నివర్గాల ప్రజలతో కలిసి ఘనంగా నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జ్ నాయకుడు చాతాళ్ల రమేష్ మాదిగ పిలుపునిచ్చారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎమ్మార్పీఎస్ నాయకుల అత్యవసర సమావేశం గుగ్గిళ్ల సురేష్ మాదిగ, ఎంపెల్లి శంకర్ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా చాతాళ్ల రమేష్ మాదిగ, తడుగుల విజయ్ మాదిగ హాజరై ఎస్సీ వర్గీకరణ ఉద్యమ చరిత్రను వివరించారు. పద్మశ్రీ మందకృష్ణ మదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలకు సాధించి పెట్టిన సంక్షేమ పథకాలను సమాజానికి చేసిన సేవలను వివరించి జెండాను ఆవిష్కరించాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యామ్ మాదిగ, మండల సీనియర్ నాయకులు ఎల్‌పి శ్రీను మాదిగ, సారయ్యమాదిగ, ముత్యాలు మాదిగ, చిన్న శ్రీను మాదిగ, సిద్ధు మాదిగ, కీసర సుమంత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ మాదిగ

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



వెంకటాపురం(కె): సదస్సులో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు



వాజేడు : చీకుపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ మహేందర్, పీఏసీఎస్ కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని మొర్రవానిగూడెంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. డీటీ మహేందర్ మాట్లాడుతూ సదస్సుల్లో సర్వే నంబర్లు, పట్టాపాస్ పుస్తకాల్లో తప్పులు ఉన్నవారు, సర్వే నంబర్లు మిస్ అయిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కారిస్తామని అన్నారు.

వాజేడు : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చీకుపల్లి, కృష్ణాపురం గ్రామాల్లో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ కుమారస్వామితో కలిసి బుధవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను తెలుపుతూ ఇచ్చిన వినతిపత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- ఎంఈఓ కోడెపాక రఘుపతి

చిట్యాల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని మండల విద్యాశాఖధికారి కోడెపాక రఘుపతి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శానిటేషన్, మధ్యాహ్న భోజన కార్మికులకు ఒకరోజు శిక్షణతో పాటు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న దృష్ట్యా అన్ని పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, ఎదుగుదల వంట కార్మికులపై ఉందని తెలిపారు. అందుకోసం సిబ్బంది తగు జాగ్రతలు పాటించాలని కోరారు. మోనూ ప్రకారం వంటలు చేసి నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. పాఠశాలలో శానిటేషన్ సిబ్బంది ప్రతిరోజు తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు కిరణ్‌కుమార్, సరళాదేవి, ఎమ్మార్పీ ఆకుల హరీశ్, సీఆర్పీ రాజు నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: పాఠశాల పరిశుభ్రతలో స్కావెంజర్ పాత్ర కీలకమైందని మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి అన్నారు. బుధవారం మండలంలోని మొట్లపల్లి ఉన్నత పాఠశాలలో పారిశుధ్య నిర్వహణపై మండల స్థాయి శిక్షణ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతిరోజు స్కావెంజర్లు పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచి ఆరోగ్యవంతమైన పాఠశాల నిర్వహణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు బోగి రాజ్‌కుమార్, శ్రీనివాస్, రాజయ్య, ఎమ్మార్సీ సిబ్బంది వేణు, వసంత, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సూచిక బోర్డులేక.. డ్రైవర్లు తికమక!

- మెట్లమీదకు దూసుకువస్తున్న వాహనాలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో ఫిబ్రవరి నెలలో కుంభాభిషేకం సమయంలో తూర్పు వైపు ప్రధాన రహదారి నుంచి మెట్ల మార్గం నిర్మాణం చేశారు. కానీ నిత్యం తూర్పు రాజగోపురం నుంచి వాహనాలు ప్రధానరహదారి వైపునకు తరలిరావాడంతో మెట్లపై దూసుకువస్తున్నాయి. అక్కడ ఎలాంటి సూచిక బోర్డులు లేక డ్రైవర్లు, వాహనదారులు తికమకపడుతున్నారు. కార్లు, వ్యాన్లు, మినీ బస్సులు మెట్లమార్గంపై వస్తు ఎదురుగా ఉండే దుకాణాల్లోకి దూసుకు వచ్చే ప్రమాదాలు ఉన్నాయి. బుధవారం ఉదయం ఓ డీసీఎం వ్యాన్ రోడ్డుమార్గం ఉందని భావించి రావడంతో మెట్లపైకి ఎక్కించాడు. కాగా, ఎలాంటి ప్రమాదం జరుగలేదు. ప్రమాదం జరుగకముందే దేవస్థానం అధికారులు నివారణ చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.



మెట్లమీదకు దూసుకువచ్చిన డీసీఎం వ్యాన్

మందులు అందించాలి

భూపాలపల్లి అర్బన్: వివిధ అనారోగ్య సమస్యలతో సింగరేణి ఏరియా ఆస్పత్రికి వచ్చే రిటైర్డ్‌మెంట్ కార్మికులకు సరిపడ మందులు అందించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఏరియా ఆస్పత్రి ఏసీఎంఓ డాక్టర్ పద్మజకు వినతిపత్రం అందజేశారు. వందల కిలోమీటర్ల నుంచి రిటైర్డ్‌మెంట్ కార్మికులు ఏరియా ఆస్పత్రికి వస్తున్నారని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెల రోజులకు సరిపడు షుగర్, బీపీ, థైరాయిడ్, మందులు అందజేయాలని ఏఐటీయూసీ నాయకులు వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మాతంగి రామచందర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా నిర్మించుకోండి

వాజేడు : ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, ఏపీఎం లక్ష్మీదుర్గ అన్నారు. మండలంలోని చెరుకూరు, పేరూరు రైతు వేదికల్లో బుధవారం లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా 602 మంది ఇళ్ల లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. కొంతమంది తమ దగ్గర పెట్టుబడి లేకపోవడంతో నిర్మాణాలను చేపట్టలేకపోయిన విషయం తమ దృష్టికి వచ్చినట్లు వారు తెలిపారు. అయితే స్వయం సహాయక సంఘాల్లో ఉన్న సభ్యురాళ్లు ప్రతీ నెలా క్రమం తప్పకుండా తీసుకున్న అప్పును చెల్లిస్తున్న వారికి కొత్తగా రుణం ఇప్పించనున్నట్లు తెలిపారు. అలా చెల్లిస్తున్న వారు ఇంటి నిర్మాణానికి డబ్బులు కావాలనుకునే వారు ఆయా గ్రూపుల ద్వారా వివరాలను ఇవ్వాలని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన

మంగపేట : మండలంలోని మంగపేట, కమలాపురం, బోరునర్సాపురం, కోమటిపల్లి, కొత్తూరు మొట్లగూడెం పంచాయతీల పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులు, సిమెంట్, ఐరన్, బ్రిక్స్ సప్లయర్స్, ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టర్లకు మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీడీఓ భద్రు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వ నియమ నిబంధనలను లబ్ధిదారులకు వివరించారు. రూ.5 లక్షలతో 400 నుంచి 430 స్క్వేర్ ఫీట్ల స్థలంలో ఇంటి నిర్మాణం ఎలా చేపట్టాలనే విషయంపై అవగాహన కల్పించారు. ఇంటి మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వెంటనే పంచాయతీ కార్యదర్శి, హౌజింగ్ ఏఈ సమక్షంలో ముగ్గు పోసి నిర్మాణం పనులను ప్రారంభించి 45 రోజుల్లో పూర్తి చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు సిమెంటు, ఐరన్, బ్రిక్స్ అధిక ధరలకు విక్రయించొద్దని సూచించారు. ఆర్థిక స్థోమత లేనటువంటి మహిళా పొదుపు సంఘాల్లోని లబ్ధిదారులకు స్త్రీనిధి ద్వారా రుణ సాయం అందించే విందగా సంబంధిత ఐకేపీ అధికారులతో మాట్లాడామన్నారు. కార్యక్రమంలో హౌజింగ్ ఏఈ , కేపి ఏపీఎం అప్పారావు, ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

ఏటూరునాగారంలోని గిరిజన భవన్‌లో మండలంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు గురువారం పంచాయతీరాజ్ స్త్రీ శిశు, సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క చేతుల మీదుగా అందజేయనున్నట్లు ఎంపీడీఓ భద్రు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు అందరూ హాజరు కావాలని కోరారు.



వాజేడు: పేరూరులో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు



మంగపేట : లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ భద్రు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

టేకుమట్ల: అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి పలు చోట్ల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడి సొంత ఇంటి కలను నిజం చేయడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పార్టీలకు అతీతంగా పేదలకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. అనంతరం వెంకట్రావ్‌పల్లి (బి)గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. అలాగే పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గర్మిళ్లపల్లి, వెలిశాల గ్రామాల్లో పల్లె దవాఖానలను ప్రారంభించారు. సుబ్బక్కపల్లి, పంగిడిపల్లిలో అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని పంగిడిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో జిల్లా సంక్షేమ అధికారిని మల్లీశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్ బిర్యాని కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవిసత్యం పాల్గొన్నారు.